క్లుప్తంగా

2,100 హెక్టార్లలో వరి నాట్లు


ఎం.గమడాం గ్రామంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

గజపతినగరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లో అన్నదాతలు ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారని మండల వ్యవసాయశాఖ అధికారి పి.కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా సుమారు 3,800 హెక్టార్లలో వరి సాగు చేపట్టాల్సి ఉండగా.. ఇంతవరకు 2,100 హెక్టార్లలో నాట్లు పూర్తయినట్లు చెప్పారు. గజపతినగరంతో పాటు ఎం.వెంకటాపురం, మరుపల్లి, ఎం.గుమడాం, దావాలపేట, బూడిపేట, కొత్తబగ్గాం, బంగారమ్మపేట, భూదేవిపేట, తదితర గ్రామాల్లో రైతన్నలు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు.

ఆర్థిక సాయం..


నలమహారాజు కుటుంబ సభ్యుకు ఆర్థిక సాయం అందిస్తున్న గ్రామ యువత

గజపతినగరం రూరల్: మండలంలోని ఎం.గుమడాం గ్రామానికి చెందిన తాడివాడ నలమహారాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో అదే గ్రామానికి చెందిన యువత మృతుని కుటుంబ సభ్యులకు 49,300 రూపాయల ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ.. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతోనే సాయం అందజేసినట్లు చెప్పారు.

గుర్లలో వైద్య శిబిరం ఏర్పాటు


రోగుల వైద్య పరీక్షల రిపోర్టును పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ జీవన్‌రాణి

సాక్షి ఎఫెక్ట్

గుర్ల: వర్షాకాలంలో ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటినే తాగాలని డీఎంహెచ్‌ఓ ఎస్. జీవన్‌రాణి, తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి సూచించారు. గుర్లకు జ్వరమొచ్చింది అనే శీర్షికతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


సమాచార హక్కు చట్టంపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పీఏసీఎస్ సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని పోరలి పీఏసీఎస్ వద్ద సమాచారం హక్కు చట్టంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ ఎం. బలరాం మాట్లాడుతూ.. జిల్లా సహకార అధికారి రమేష్ ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పౌరులు అడిగిన సమాచారాన్ని 30 రోజుల్లోపు అందజేయాలన్నారు. ఈ చట్టం ద్వారా వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే సమాచారం తప్ప మిగిలిన సమాచారం ఇవ్వాల్సిందేనని చెప్పారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు.

అధికారుల పరిశీలన


పోతనాపల్లి వద్ద గెడ్డను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు, వాగులు, గెడ్డల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకునేందుకు మండల అధికారులు గ్రామాల్లో సోమవారం పర్యటించారు. మండలంలోని ఎస్‌జీ పేట, వినాయకపల్లి, పోతనాపల్లి, ఎస్.కోట, బీకేఆర్ పురం, కొత్తూరు గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. అలాగే ఆయా గ్రామాల రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రవికిరణ్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సతీష్, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు..

వరుణుడు శాంతించకపోవడంతో మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు చెరువులు, వాగులు, వంకలు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రోడ్ల మీదుగా వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. పొలాలు ముంపునకు గురయ్యాయి. కొన్ని చోట్ల ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. కొత్తవలస గ్రామం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. అక్కడి రైల్వే అండర్ బ్రిడ్జి తాత్కాలికంగా మూసివేయగా.. రిటర్నింగ్ వాల్ కొట్టుకుపోయింది. వేపాడ మండలంలో కూడా భారీవర్షాలకు ప్రజానీకం ఇబ్బంది పడ్డారు.

– గజపతినగరం/కొత్తవలస


గజపతినగరం: మండల కేంద్రంలో ఓ వెల్డింగ్ షాపులో చేరిన వర్షపు నీరు



కొత్తవలస: తాత్కాలికంగా రైల్వే అధికారులు మూసేసిన కొత్తవలస రైల్వే అండర్ బ్రిడ్జి


గజపతినగరం: పురిటిపెంట అంగన్‌వాడీ భవనం ఆవరణలో చేరిన మురుగు నీరు


కొత్తవలస: కొట్టుకుపోయిన వీరభద్రపురం గ్రామం వెదుర్ల పైడితల్లి అమ్మవారి గుడికి వేసిన సీసీ రోడ్డు రిటర్నింగ్ గోడ


కొత్తవలస: మూడు రోడ్లు జంక్షన్‌లో వరద నీరు పోయేందుకు జేసీబీతో ప్రత్యామ్నాయ కాలువ తీయిస్తున్న పంచాయతీ అధికారులు


గంట్యాడ: చంద్రంపేట, వసంత గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డ


వేపాడ: సోంపురం అండర్ బ్రిడ్జి నీటిలో ఆదివారం రాత్రి చిక్కుకుపోయిన కారును బయటకు తీసున్న అగ్నిమాపక సిబ్బంది


వేపాడ: ఆతవ వెళ్లే రహదారిలో బ్రిడ్జి మీదుగా ప్రవహిస్తున్న నీరు


వేపాడ: నల్లబిల్లి సమీపంలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు


వేపాడ: తోము చెరువును పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి చిన్న రెడ్డయ్య, తహసీల్దార్ రాములమ్మ


వేపాడ: సోంపురం అండర్ బ్రిడ్జిలో నిలిచిపోయిన ట్రాక్టర్ ఇంజిన్‌ను జేసీబీ సహాయంతో లాగుతున్న దృశ్యం

అప్రమత్తంగా ఉండండి

- రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు
- స్పెషలాఫీసర్ రమేష్‌కుమార్


అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి పి.రమేష్‌కుమార్

గజపతినగరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రానున్న 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి పి.రమేష్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల వల్ల కలిగే నష్టాలను ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలని సూచించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలను అప్రమత్తం చేసి, వారికి ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సమకూర్చాలన్నారు. వాగులు, వంకలు, చెరువులకు గండ్లు పడితే రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పుష్పలత, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ శోభారాణి, ఈఓ జనార్దనరావు, తదితరులు పాల్గొన్నారు.

పెదవేమలి ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ


ఫిర్యాదు కాపీ చదువుతున్న ఏపీడీ రమామణి

గంట్యాడ: మండలంలోని పెదవేమలి ఫీల్డ్ అసిస్టెంట్ వేచలపు శ్రీనివాసరావుపై సోమవారం స్థానిక సచివాలయంలో ఉపాధి ఏపీడీ రమామణి విచారణ చేపట్టారు. వేతనదారులకు పని కల్పించకపోవడం, పంచాయతీ తీర్మానం లేకుండా పనులు చేయించడం, ఇష్టంలేనివారికి పనులు నిలిపివేయడం చేస్తున్నాడని గ్రామ సర్పంచ్ కలెక్టర్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఏపీడీ విచారణ చేపట్టగా.. 160 మంది వేతనదారులకు ఒక రోజు పని కావాలనే కల్పించలేని వేతనదారులు అమ్మన్నమ్మ, జి. జగన్నాథం, ఆర్. నాగేశ్వరావు, సీహెచ్. సన్యాసమ్మ, జి. కొండమ్మ, డి. గోవింద, ఆర్, దేవుడుమ్మ, తదితరులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏపిఓ జి. సుందరరావు, సర్పంచ్ వర్రి పాపునాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు పొటుపురెడ్డి భవానీ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి


తహసీల్దార్ కార్యాలయంలో ఆందోళన చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

శృంగవరపుకోట: జిందాల్ అక్రమంగా చేసుకున్న రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని ఏపీ రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిందాల్ నిర్వాసితులతో కలిసి సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. దెప్పూరు, బందవలస గ్రామాల ప్రజలకు తెలియకుండానే వారి భూములు జిందాల్ పేరుమీద రిజిస్ట్రేషన్ అయిపోయాయన్నారు. వెంటనే ఈ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి రైతులకు భూములు అప్పగించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఇదే సమయంలో ఎస్.కోట పోలీసులు జిందాల్ నిర్వాసితులను అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అక్కడే ఉన్న ఎమ్మెల్సీ రఘురాజు స్పందిస్తూ నిర్వాసితులు తమ బాధను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. జిందాల్ గురించి ఎవ్వరూ మాట్లాడకూడదని ప్రభుత్వం జీఓ ఇచ్చిందా అంటూ మండిపడ్డారు.

రహదారులిలా.. రాకపోకలెలా..?


గజపతినగరం: ప్రమాదకరంగా మారిన గజపతినగరం దిగువ వీధి రోడ్డు

అసలే అంతంతమాత్రంగా ఉన్న రహదారులు వర్షాలకు మరింత ప్రమాదకరంగా మారాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల అభివృద్ధి గురించి పట్టించుకోకపోవడంతో ఏ రహదారి చూసినా గోతులతో దర్శనమిచ్చేది. అప్పట్లోనే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజానీకం రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతూ పలుమార్లు ఆందోళనలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఈ పరిస్థితుల్లో మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లన్నీ మరీ దారుణంగా తయారయ్యాయి. చాలా చోట్ల రోడ్లు కొట్టుకుపోగా.. పలుచోట్ల భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ఆయా రహదారుల మీద రాకపోకలకు ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు.

– గజపతినగరం/వేపాడ/దత్తిరాజేరు


వేపాడ: వర్షాలకు కోతకు గురైన మారిక రోడ్డు


దత్తిరాజేరు: పెదమానాపురం ఆర్‌ఓబీ వద్ద తాత్కాలిక రోడ్డులో ఏర్పడిన గోతులు

నష్టాలు తెలియజేయండి..


దత్తి గ్రామంలో పర్యటిస్తున్న మండల ప్రత్యేక అధికారి విమలారాణి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీ

దత్తిరాజేరు: భారీ వర్షాల వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందులను తెలియజేసేందుకు మండల పరిషత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి విమలారాణి అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, గడసాంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివాజీతో కలిసి సోమవారం పర్యటించి, ముంపు పరిస్థితిపై ఆరా తీశారు. వర్షాలు ఎక్కువగా పడితే దత్తి కాలనీవాసులకు తాత్కాలిక పునరావాస కేంద్రం సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రెండు రోజులు పాటు కురిసిన వర్షాల వల్ల వ్యాధులు ప్రబలకుండా వెంటవెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు.

పారిశుధ్యంపై ఆరా..


ఉత్తరావల్లిలో వీధి కాలువను పరిశీలిస్తున్న తహసీల్దార్ సులోచనారాణి, వైస్ ఎంపీపీ హరిబాబు, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది

మెరకముడిదాం: గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులపై తహసీల్దార్ సులోచనారాణి ఆరా తీశారు. మండలంలోని ఉత్తారావల్లి, మెరకముడిదాం గ్రామాల్లో సోమవారం పర్యటించి, పారిశుధ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షపు నీరు ఎక్కడా నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో చెత్తాచెదారాలను ఎప్పటికప్పుడు తొలగించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. డయేరియా, మాలేరియా, డెంగీ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందిని సూచించారు.

ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి


విలేకరులతో మాట్లాడుతున్న మాలమహానాడు నాయకులు

చీపురుపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, అంతవరకు శాంతియుత నిరసన కొనసాగుతుందని మాలమహానాడు నాయకుడు రత్నాకర్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మాల సామాజిక వర్గాన్ని అణిచివేసే కార్యక్రమం చేపడుతున్నారన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గంపై కత్తి కట్టాయని ఆరోపించారు. కులాలు, మతాల పేరిట ప్రజలను విభజించి పాలించే పద్ధతి ఎంతోకాలం ఉండదన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు రేగిడి రామకృష్ణ, ఎత్తుల ఈశ్వరరావు, అడ్డూరి కృష్ణ, రవిశంకర్, చినరాముడు,రాము, బూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పాక్షికంగా కూలిన రెండు ఇళ్లు


కుమ్మపల్లిలో పాక్షికంగా కూలిన మిద్దె ఇల్లు

వేపాడ: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కుమ్మపల్లిలో రెండు మిద్దె ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు తహసీల్దార్ రాములమ్మ తెలిపారు. దీంతో ఆమె ఆదేశాల మేరకు వీఆర్‌ఓ శ్రీను గ్రామంలో సోమవారం పర్యటించి బాధితులు కాకర పైడమ్మ, కాకర శ్రావణిలతో మాట్లాడి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తానని చెప్పారు. ఇదిలా ఉంటే మంగళవారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


పడిపోయిన గోడను పరిశీలిస్తున్న మండల అధికారులు

కూలిన గోడ..

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కొండదాడి గ్రామంలో పులి గౌరమ్మకు చెందిన పూరింటి గోడ సోమవారం కూలిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోడ పూర్తిగా నానిపోయి పడిపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ అచ్యుతరావు, తదితరులు గ్రామంలో పర్యటించి వివరాలు సేకరించారు.

421 పింఛన్ల తొలగింపు

గుర్ల: మండలంలోని 421 మంది దివ్యాంగ పింఛన్లను అనర్హత కారణంగా తొలగించినట్లు ఎంపీడీఓ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తొలగించిన పింఛన్‌దారులకు నోటీసులు అందజేస్తున్నట్లు పేర్కొన్నారున. వీరిలో 40 మందికి దివ్యాంగ పింఛన్ అర్హత లేకపోయినా 60 ఏళ్లు పూర్తి కావడంతో వృద్ధాప్య పింఛన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న వారు 30 రోజుల్లోపు పాత సదరం సర్టిఫికెట్ చీపురుపల్లి సీహెచ్‌సీ, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో అప్పీల్ చేసుకోవచ్చన్నారు.

సమన్వయంతో పని చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న డివిజనల్ అభివృద్ధి అధికారి హేమసుందరరావు

చీపురుపల్లి రూరల్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులందరూ సమన్వయంతో పని చేసి చర్యలు చేపట్టాలని డివిజనల్ అధికారి హేమసుందరరావు సూచించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల సమయంలో ఎక్కడా కూడా నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు, కాలువలు పొంగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పంట నష్ట వివరాలు, పాడైన రోడ్ల వివరాలు, గండ్లు పడిన చెరువుల వివరాలు ఎప్పటికప్పుడు తమకు తెలియజేయాలన్నారు. అలాగే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ధర్మరాజు, ఎంపీడీఓ ఐ.సురేష్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగునీటి చెరువులపై దృష్టి

- మండల ప్రత్యేకాధికారి డి.మల్లికార్జునరావు


సదాశివుని చెరువు చప్టాను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు, ఎంపీడీఓ భాస్కరరావు, ఏఈ లక్ష్మీకాంత్

మెరకముడిదాం: వర్షాకాలంలో సాగునీటి చెరువులపై ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి డి.మల్లికార్జునరావు ఆదేశించారు. కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశాల మేరకు ఆయన మండలంలోని ఉత్తరావల్లిలో సదాశివుని చెరువుని పరిశీలించారు. అకాల వర్షాల కారణంగా చెరువుకు గండి పడే అవకాశం ఉండేమోనన్న కోణంలో ఆయన పరిశీలించగా.. చెరువులో పెద్దగా నీరు లేకపోవడాన్ని గమనించారు. దీంతో మండలంలో మిగిలిన చెరువుల పరిస్థితులపై ఎంపీడీఓ జి.భాస్కరరావు, ఇరిగేషన్ ఏఈ లక్ష్మీకాంత్‌లను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని సాగునీటి చెరువులపై సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశించారు.

జాగ్రత్తలు పాటించండి

వేపాడ: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు పశువుల సంరక్షణపై జాగ్రత్తలు పాటించాలని స్థానిక పశువైద్యాధికారి కోరాడ గాయత్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువులను ఎత్తైన ప్రదేశంలో కట్టడంతో పాటు పరిశుభ్రమైన నీరు, మేత అందించాలని పేర్కొన్నారు. ఉరుములు, మెరుపులు వచ్చే సమయంలో బయటకు మేత కోసం తీసుకెళ్లకూడదని సూచించారు.